క్లుప్తంగా

కనక మహాలక్ష్మి అమ్మవారికి వెండి వస్తువుల బహూకరణ


వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కనక మహాలక్ష్మి అమ్మవారికి వెండి బిందె, ప్లేట్లను దాతలు బహూకరించారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, కమిటీ సభ్యులకు దాతలు వెండి వస్తువులను ఆదివారం అందజేశారు. విశాఖపట్టణానికి చెందిన ఎస్.తిరుమలరావు, నాగకన్య దంపతులు అరకిలో వెండితో బిందె, ప్లేట్లతో పాటు 38 గ్రాముల వెండితో మూడు వెండి గిన్నెలు వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గవిడి నాగరాజు, పొట్నూరు త్రినాథరావు, సూరు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సత్కారం


శివప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న చిన మధుపాడ గ్రామస్తులు

గంట్యాడ: మండలంలోని చిన మధుపాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసిన బంకపల్లి శివప్రసాద్‌ను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. శివప్రసాద్‌కు వేరే ప్రాంతానికి బదిలీ జరగడంతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జీవీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజాలమ్మ పండగ


అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గుర్ల: మండల కేంద్రంలో రాజాలమ్మ తల్లి పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి పుసుపు, కుంకమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసినట్లు స్థానిక నేతలు ఇజ్జిరోతు ప్రసాద్, కిలారి సూర్యనారాయణ, సారిక సూరప్పుడు తెలిపారు.

పుట్టిన రోజున పేదలకు సాయం


దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న గౌతమ్, తండ్రి నానాజీ

శృంగవరపుకోట: పుట్టిన రోజున కొత్త దుస్తులు ధరించి, బంధుమిత్రులతో విందు,వినోదాల్లో సందడిగా గడపడం మనం చూస్తుంటాం. అయితే ఇప్పుడు చాలా మంది తమ ఆలోచనలను మార్చుకుంటున్నారు. మన పుట్టిన రోజున పస్తులతో కాలక్షేపం చేస్తున్న పేదలకు ఒక్కపూటైనా తిండి పెట్టాలన్న ఆలోచన పురుడు పోసుకుంటోంది. ఇదే పంథాలో మండలంలోని ధర్మవరంలో కుసుమంచి నానాజీ తన కొడుకు గౌతమ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పలువురు దివ్యాంగులు, పేదలకు నిత్యావసర సరుకులు అందించారు. దీంతో చాలామంది తండ్రీకొడుకులను అభినందించారు.

నిత్యావసరాల పంపిణీ


ఒంటరి వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలో గల ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ విశ్వనాథ హరికుమార్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బాబూజీ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

చీపురుపల్లి: పట్టణంలోని బాబూజీ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ శస్త్ర చికిత్సలో రోగి కడుపు నుంచి 3.5 కిలోల కణితి తొలగించారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని వంగపల్లిపేట గ్రామానికి చెందిన ఎస్.పార్వతి అనే మహిళ కడుపు నొప్పితో బాబూజీ ఆస్పత్రిలో చేరింది. దీంతో అక్కడ స్త్రీ వైద్య నిపుణులు ఆమెను పరీక్షించి కణితిని గుర్తించి, శస్త్రచికిత్స ద్వారా తొలగించారు.

హైస్కూల్ ప్లస్‌లో.. ఇంటర్ విద్యకు మంగళం

- ఏడాదికే వెనకడుగు..
- అయోమయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు
- ప్రైవేట్ కళాశాలల వైపు పరుగులు తీస్తున్న వైనం


ఇంటర్ మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులు


హైస్కూల్ ప్లస్ ఎత్తివేసిన జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

జామి: మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు మండల వాసులు, ఉపాధ్యాయ సంఘాలు, విశ్రాంత ఉపాధ్యాయులు, తదితర అన్న రంగాల వారు సుమారు ఎనిమిది సంవత్సరాలు అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. ఎట్టకేలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ విద్య ప్రవేశపెట్టింది. దీంతో 2024లో జామి హైస్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభమయ్యాయి. దీంతో మండలవాసులు ఎంతో సంతోషించారు. గతేడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో 22 మంది చేరారు. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జామి హైస్కూల్ ప్లస్‌కు మంగళం పాడారు. ప్రస్తుతం ప్రథమ ఇంటర్‌కు సంబంధించి అడ్మిషన్లు కూడా చేపట్టలేదు. గతేడాది ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులు సీనియర్ ఇంటర్‌కు చేరుకున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇటీవల జరిగిన బదిలీల్లో జామి హైస్కూల్‌కు అధ్యాపకుల నియామకం కూడా చేయలేదు. ప్రస్తుతం సెకెండ్ ఇయర్‌కు వచ్చిన విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల వైపు పరుగులు తీస్తున్నారు. కొంతమంది ఓపెన్ ఇంటర్‌లో జాయిన్ అయ్యారు. మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులకు సంబంధించి టీసీలు కూడా ఇవ్వలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే టీసీలు ఇచ్చేస్తామని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు

కళాశాల ఎత్తేశారన్నారు..



జామి జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదివాను. సెకెండ్ ఇయర్ పాఠశాలలో లేదని ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో పడ్డాం. తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ కళాశాలలో జాయిన్ అయ్యాను.

– చుక్క ఎర్నాయుడు, ఇంటర్ విద్యార్థి

ఓపెన్ ఇంటరే గతి..



ఇంటర్ రెండో సంవత్సరం నిలిపివేశారు. కళాశాలకు వెళ్తే తరగతులు జరగడం లేదు. దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఓపెన్ ఇంటర్‌లో జాయిన్ అయ్యాను. టీసీ కూడా ఇంతవరకు ఇవ్వలేదు.

– ఆర్.దుర్గాశంకర్, ఇంటర్ విద్యార్థి

హైస్కూల్ ప్లస్ నిలిపివేశారు..

జామి హైస్కూల్ ప్లస్‌లో ప్రస్తుతం ఇంటర్ తరగతులు నిలిపివేశారు. మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరగలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించడం జరుగుతుంది.

– జి.జయశ్రీ, ఎంఈఓ, జామి

చందన అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి..



జామి మండలంలో కుమరాం కల్యాణ్‌నగర్‌లో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారిని చందనంతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు కె.వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

– జామి

ఘనంగా ఏకలవ్య జయంతి


ఏకలవ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎరుకుల సంఘు పెద్దలు

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లిలో ఏపీ రాష్ట్ర ఎరుకుల సేవా సంఘు పెద్దలు, సభ్యులు ఏకలవ్య జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ రాష్ట్ర ఎరుకుల సేవా సంఘు ఉపాధ్యక్షుడు జి.సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు రొంగలి చినరాము, ఉత్తరాంధ్ర చైర్మన్ గేదెల లక్ష్మణ, మహిళా కార్యదర్శి దాసరి సత్యవతి, జిల్లా ఉపాధ్యక్షురాలు డి.సంతోషి, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, యువజన అధ్యక్షుడు రమణ, జిల్లా కార్యదర్శి గేదెల అప్పారావు, ఎస్.కోట మండల శాఖ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, గేదెల పోతయ్య, దాసరి దేముడు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీగా లెంక


లెంక శ్రీరాములు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీగా గరివిడి మండలం కాపుశంబాం గ్రామానికి చెందిన లెంక శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. లెంక శ్రీరాములు 1981–87 వరకు కాపు శంబాం పంచాయతీ సర్పంచ్‌గా.. 1992 – 2024 వరకు పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఉంటూ పార్టీకి సేవలందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన సతీమణి లెంక సుశీల పంచాయతీ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమించడం పట్ల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, శాసన మండల ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు శ్రీరాములు కృతజ్ఞతలు తెలియజేశారు.

విస్తృత స్థాయి సమావేశానికి తరలిరండి

- మాజీ ఎమ్మెల్యే బొత్స


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలోని బెల్లాన ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, తదితరులు హాజరవుతారన్నారు. ఐదు మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, మండల నాయకుడు బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు

విజయవంతం చేయండి

వేపాడ: నియోజకవర్గ కేంద్రమైన శృంగవరపుకోటలో మంగళవారం నిర్వహించే వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. మండంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, సర్పంచ్‌లు, నాయకులు హాజరుకావాలని కోరారు.

సమ్మెను విజయవంతం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అప్పలరాజు

జామి: ఈ నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధాని మోదీ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో అన్ని రంగాల వారు పాల్గొనాలని కోరారు. కార్మిక చట్టాలు మార్చడంతో పాటు స్కీమ్ వర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, అంగన్‌వాడీ, ఆశా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.వరలక్ష్మి, డి.కుమారి, అచ్యుతాంబ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు


పూజలు చేస్తున్న అర్చకుడు నగేష్

దత్తిరాజేరు: ఆషాఢ తొలి ఏకాదశి సందర్భంగా గడసాం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు నగేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోత్రనామాలతో పూజలు చేపట్టారు.

భైరిపురంలో..


మెరకముడిదాం: పూజలు నిర్వహిస్తున్న ఆలయ ప్రధానార్చకుడు సముద్రాల శ్రీధరాచార్యులు

మెరకముడిదాం: మండలంలోని భైరిపురంలో వెలిసిన పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానార్చకుడు సముద్రాల శ్రీధరాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళా భక్తులు ఉపవాస దీక్షలతో స్వామివారికి పూజలు చేశారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలో పలు చోట్ల వైష్ణవ దేవాలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి. పుణ్యగిరిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం


పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న ఎ.డి కృష్ణ


చీపురుపల్లి: పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేస్తున్న ఎ.డి సుబ్రహ్మణ్యం

గంట్యాడ: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రెడ్డి కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాంతీయ పశు వైద్యశాల వద్ద ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు.

కుక్కలకు రేబిస్ టీకాలు..

చీపురుపల్లి: పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రాంతీయ పశువైద్య కార్యాలయం వద్ద క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 60 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కుక్కలు పెంచే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు.

వేపాడలో: మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం ఆవరణలో జూనోసిస్ డే సందర్భంగా పశువైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యంలో కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. అనంతరం డాక్టర్ గాయత్రి పెంపుడు కుక్కల యజమానులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పశుసంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

గంట్యాడ: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన బండారు ఎర్నాయుడు అనే వ్యక్తి కొంతకాలంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఆదివారం బోనంగి వద్ద తనఖీలు చేపట్టారు. ఈ సమయంలో పది మద్యం సీసాలతో ఎర్నాయుడు పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పర్యావరణాన్ని కాపాడుదాం..


మొక్క నాటుతున్న గోవిందరాజులు, బ్యాంక్ సిబ్బంది

చీపురుపల్లి రూరల్ (గరివిడి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు పిలుపునిచ్చారు. కెనరాబ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గరివిడిలో గల అబ్యాస్ స్కూల్ ఆవరణంలో బ్యాంక్ సిబ్బందితో కలిసి ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎం.వెంకటకుమార్, బ్యాంక్ సిబ్బంది, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పెషల్ సర్వీస్

వేపాడ: మండలంలోని సోంపురం నుంచి జాకేరు, కరకవలస, చామలాపల్లి మీదుగా బడిబస్సును సోమవారం ప్రారంభించనున్నట్లు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట డిపో నుంచి బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ అంగీకరించారని అప్పారావు పేర్కొన్నారు. సోమవారం సోంపురంలో ఉదయం 7.20 గంటలకు బస్సు ప్రారంభమవుతుందని తెలిపారు.

ఆర్థిక సాయం..


రెహమాన్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ నేతలు

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మన్ షేక్ రెహమాన్ శాశనపల్లి గ్రామంలో విధి నిర్వహణలో ఉంటూ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఏపీఈఈయూ 1104 యూనియన్ ప్రతినిధులు 25 వేల రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రీజనల్ సెక్రటరీ ఎస్.లక్ష్మణ్, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంగునాయుడు, రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పైడిరాజు, రూరల్ బ్రాంచ్ సెక్రటరీ దేముడు, వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, సెక్రటరీ అప్పారావు, సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం..


కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

జామి: అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, తదితరులు గ్రామంలో పర్యటించి, ఏడాది పాలనలో చేపట్టిన సంస్కరణలను ప్రజలకు వివరించారు. అయితే గ్రామస్తులు మాత్రం పలు సమస్యలపై ఏకరవు పెట్టారు. సమస్యలను విన్న మంత్రి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.స్వామినాయుడు, ఎల్.రవికుమార్, బండారు పెదబాబు, మాకిరెడ్డి లక్ష్మి, ఎన్నింటి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి సార్..

గజపతినగరం: మండలంలోని సీతారామపురం, పిడిశీల గ్రామాల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, తదితరులు 'సుపరిపాలనలో ముందడగు' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. సమస్యల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, సీనియర్ నేతలు గంట్రోతు గోవింద్, ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 17న సామూహిక కనకాభిషేకం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): తిరుపతి శ్రీ వాసవీ ఆర్యవైశ్య సేవా సమాజం ఆధ్వర్యంలో ఆగస్టు 17న తిరుపతిలో 15వ సామూహిక కనకాభిషేకం మహోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు వీవీఎస్ఎస్ఎన్ గుప్త ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహం జరిగి 50 ఏళ్లు పూర్తయిన ఆర్యవైశ్య వృద్ధ దంపతులకు పూజలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 20వ తేదీలోగా తిరుపతి ఆర్యసేవా సమాజం వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 92478 66246 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు


గజపతినగరం: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శృంగవరపుకోట: జనసంఘ్ వ్యవస్థాపకుడు, కేంద్ర మాజీ మంత్రి, దివంగత శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని మండల కేంద్రంలోని ఓ భవనంలో ఆదివారం నిర్వహించారు. బీజేపీ నాయకుడు డి.సూర్యారావు సమక్షంలో పలువురు నాయకులు శ్యామ్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వారాది చిరంజీవి, దాశెట్టి దాశరథి, జి.బంగారునాయుడు, జ్ఞానేష్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా..

గజపతినగరం: మండల కేంద్రంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి ఘనంగా నిర్వహించారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ రెడ్డి పావని, తదితరులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్, దొగ్గ దేవుడుబాబు, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల వినూత్న నిరసన


గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: అధికారులు, పోలీస్ యంత్రాంగం తమ పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ జిందాల్ నిర్వాసితులు బొడ్డవర జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ.. తాము ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ఉన్నామా.. ఆంగ్లేయుల పాలనలో ఉన్నామా అన్న విషయం అర్థం కావడం లేదన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తామన్నా శిబిరం ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోవడం దారుణమని వాపోయారు. పోలీసులతో అక్రమ అరెస్టులు, కేసులు పెట్టించి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకులు నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.